క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్ : మండలంలోని సింగరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెదగొన్నూరు, ఉప్పరగూడెం, విశ్వనాద్రిపాలెం, ఈడేపల్లి గ్రామాల్లో విద్యుత్‌లైన్లకు దగ్గర్లో ఉన్న చెట్లను కొట్టారని, ఈ కారణం వల్ల విద్యుత్ సరఫరా అంతరాయానికి గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సుబ్బారాయుడి కానుకల లెక్కింపు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా 95 రోజులకు స్వామికి రూ.12,95,099 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. 13.1 గ్రాముల బంగారం, 530 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. కానుకల లెక్కింపునకు భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధు మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక



పామర్రు: ప్రజా సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం దస్తావేదులలో ఉన్న తప్పులను పరిష్కరించాలని, నివాస గృహాలు కావాలని, పెన్షన్ ఇప్పించాలని తదితర దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వధూవరులకు కైలే ఆశీర్వాదం



పసుమర్రు(పామర్రు): మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జుఝువరపు చిన్ని కుమారుడి వివాహ వేడుకలు సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, నాయకుడు పెయ్యల రాజు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి వారాహి మహోత్సవాలు

మండవల్లి: మండవల్లి విజయదుర్గా అమ్మవారి అలయంలో 26 నుంచి జూలై నాల్గో తేదీ వరకు శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి పూజా మహోత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 4న విశేష పుష్పపూజ కార్యక్రమం జరగుతుందని తెలిపారు.

తాగునీటి బోరు ఏర్పాటు



నిమ్మలూరు(పామర్రు): గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారి అవసరాలను తీర్చేందుకు తాగునీటి బోరుని ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మలూరులో ఏర్పాటు చేసిన బోరును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామస్తుల అవసరాల కోసం 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.3.60 లక్షలను బోరు ఏర్పాటుకు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పల్లికొండ రత్నకుమారి, గ్రామ సర్పంచ్ నూకల గోపాలం, స్థానికుడు సీతారామయ్య పాల్గొన్నారు.

విత్తనాల కోసం అన్నదాతల అవస్థలు

అరకొరగా వరి విత్తనాల పంపిణీ



వల్లూరుపాలెంలో వరినాట్లకు సిద్ధం చేసిన పొలం



← పచ్చగా కళకళలాడుతున్న నారుమడి

తోట్లవల్లూరు: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే వరి విత్తనాలు అరకొరగా పంపిణీ చేయడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. తోట్లవల్లూరు మండలంలోని పదిహేను గ్రామాల పరిధిలో ప్రతి ఏటా సుమారు ఎనిమిది వేల ఎకరాలకుపైగా వరి పంటను రైతులు సాగు చేస్తారు. దీనికి సంబంధించి ఇప్పటికే వరి నారుమడులు ఏర్పాటు చేశారు. దీని కోసం ఎంటీయూ 1061, బీపీటీ వంటి రకాలను ఎక్కువగా వినియోగించారు. సాగు విస్తీర్ణంలో సగ భాగం విద్యుత్ బోర్ల ద్వారా సాగవుతుండగా, మిగిలిన విస్తీర్ణం కాలువల ద్వారా సాగునీటితో సాగవుతుంది. విద్యుత్ బోర్ల ద్వారా సాగు నీటి అవకాశం ఉన్న రైతులు వరి నారుమడులు ఏర్పాటు చేయటంతో అవి ఏపుగా ఎదుగుతూ, పచ్చగా కళకళలాడుతున్నాయి.

మొక్కుబడిగా విత్తన సరఫరా..

వ్యవసాయశాఖ కేవలం 250 క్వింటాళ్ల విత్తనాలను మొక్కుబడిగా సరఫరా చేసి చేతులు దులుపుకుంది. దీంతో రైతులు విత్తనాల కోసం వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలైతే సబ్సిడీతో తక్కువ ధరకు వచ్చేవని, మార్కెట్‌లో ఎక్కువ ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

వర్షం కోసం ఎదురుచూపు..

వాతావరణ ప్రతికూలత రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. మే నెలలో కుండపోతగా కురిసిన వర్షాలు, జూన్‌లో మాత్రం కనుచూపు మేరలో కనిపించకపోవటం అన్నదాతలను కలవరపరుస్తోంది. జూన్ నెల తుది దశకు చేరుకున్నా వర్షాలు కురవకపోవటంతో ఈ ఏడాది సాగు పనులు కాస్త మందకొడిగా సాగే అవకాశం ఉందని అంటున్నారు. వర్షాలు కురిస్తేనే సాగు పనులు వేగవంతంగా జరగటానికి ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు.

వరినాట్లకు సన్నద్ధం

మాగాణి పొలాల్లో ఖరీఫ్ పనులు ఊపందుకుంటున్నాయి. ముందస్తుగా ఏర్పాటు చేసిన వరి నారుమడులు అదనుకు వస్తుండటంతో రైతులు వరినాట్లకు సన్నద్ధమవుతున్నారు. పొలాలకు ఎరువులు తరలించి వెదల్లచటంతోపాటు దుక్కులు దున్నిస్తున్నారు. గట్లను పటిష్టం చేయటంతోపాటు నీటితో తడిపి దమ్ము చేయిస్తున్నారు.

విత్తనాల కొరతతో ఇబ్బంది



వరి విత్తనాల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రైతు సేవా కేంద్రాలకు ప్రభుత్వం తూతూమంత్రంగా విత్తనాలు సరఫరా చేసి చేతులు దులుపుకుంది. విత్తనాల కోసం బయటి వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

– మైనేని తారాచంద్, రైతు, గరికపర్రు

ఇబ్బందులు లేకుండా చూడాలి



ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాగు పనులు చేపడుతున్న రైతులకు ప్రభుత్వం ఇబ్బందులు లేకుండా చూడాలి. విత్తనాలు, ఎరువులు సకాలంలో సరిపడా సరఫరా చేస్తూ అండగా నిలవాలి. అన్నదాత సుఖీభవ నగదు త్వరగా విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలి.

– బడుగు శంకర్, రైతు, వల్లూరుపాలెం

యువత పోరుకు భారీగా తరలిన నేతలు



ఆటపాక నుంచి ఏలూరు బయలుదేరిన వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, నాయకులు

కైకలూరు: యువకులకు నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం తదితర అంశాలపై ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన యువత పోరు కార్యక్రమానికి కైకలూరు నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో ఆటపాక ఐస్ ఫ్యాక్టరీ నుంచి నాయకులు వాహనాల్లో వెళ్లారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజుల సంఘు అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, ఏలూరు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీ సయ్యపురాజు గుర్రాజు, జాయింట్ సెక్రటరీ ఐనాల బ్రహ్మాజీ, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీలు గంటా సంధ్య, కనక దుర్గారాణి, ముదినేపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గాదిరాజు వెంకట కిషోర్ మణికంఠ వర్మ, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల వెంకట నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రాము, రమేష్, యేసోబురాజు, రామరాజు, నాయకులు జయమంగళ కాసులు, విజయబాబు, అర్జునరావు, థామస్, గోకర్ణయాదవ్, దున్నా బేబీ, పాము రవికుమార్ తరలివెళ్లారు.



మచిలీపట్నంలో నిర్వహించిన యువత పోరులో పాల్గొన్న పమిడిముక్కల నాయకులు

యువజన విభాగం ఆధ్వర్యంలో..

పమిడిముక్కల: మచిలీపట్నంలో జరిగిన యువత పోరుకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, నిరుద్యోగులు, యువకులు తరలివెళ్లారు. జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో జరిగిన ఫీజు పోరులో పాల్గొని, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా పార్టీ కార్యదర్శి తిరుమలశెట్టి బోసుబాబు, జిల్లా వాలంటరీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బొల్లా సాంబశివరావు, మండల ప్రధాన కార్యదర్శులు గొర్కెపూడి బుజ్జి, కనుమూరి వెంకటేశ్వరరావు, బండ్రపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణం వద్దంటూ నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేస్తున్న లబ్ధిదారులు

మండవల్లి: తమ స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం వద్దంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇందిరమ్మ ఇళ్ల కాలనీ లబ్ధిదారులు సోమవారం రిలే దీక్షలు చేశారు. పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు ఉపసంహరించుకోవాలని, లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల స్థలాలు మెరక చేయించి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేయాలని, రెవెన్యూ అధికారులు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమంటూ నినాదాలు చేశారు. తరుగు మూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులు రిలే దీక్షలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రభుత్వం పేదలను గుర్తించి 131 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందన్నారు. కామన్ సైట్‌లో పోలీస్ స్టేషన్ నిర్మించేందుకు పంచాయతీ తీర్మానం చేసిందని, రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం దారణమన్నారు. కార్యక్రమంలో బుద్ధుల రాముడు, ఏడుకొండలు, చంద్రశేఖర్, చిన వెంకటేశ్వరరావు, పద్మ, సుజాత, లక్ష్మీప్రసన్న, రాజ్యలక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటుకు సహకారం అభినందనీయం



భూమి స్వాధీన పత్రాలు అందజేస్తున్న దాత శివరామకృష్ణ

తోట్లవల్లూరు: హిందూ శ్మశానవాటిక ఏర్పాటుకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక అన్నారు. స్థానిక నార్తువల్లూరు శ్మశానవాటిక ఏర్పాటుకు అవసరమైన భూమిని గ్రామానికి చెందిన వేమూరి తాతారావు, కుమారుడు వేమూరి శివరామకృష్ణ స్వచ్ఛందంగా అందజేశారు. కృష్ణానది తీరాన వారికి ఉన్న వ్యవసాయ భూమిలో 22 సెంట్లు భూమిని గ్రామ పంచాయతీ పేరు మీద స్వాధీన హక్కును రాయించి, ఆ పత్రాలను సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు అందజేశారు. భూమిని అందించిన దాతలు తాతారావు, శివరామకృష్ణను సర్పంచ్ రాధిక, కార్యదర్శి శ్రీనివాసరావు అభినందించారు. తోట సాయిబాబు, కోలుకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సులభశైలిలో బోధించాలి



విద్యార్థి సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక తరగతుల విద్యార్థులకు సులభశైలిలో బోధించాలని ఎంఈఓ కె.నరేష్ కుమార్ అన్నారు. మండలంలోని కోమర్రు ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇంగ్లీషు, లెక్కల సబ్జెక్టులపై విద్యార్థులకుండే భయాలను తొలగించేందుకు సరళమైన విధానంలో బోధించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు.

బందర్ కాలువకు జలకళ



వీరంకిలాకుల నుంచి విడుదల చేసిన నీరు



వీరంకిలాకుల నుంచి దిగువకు వెళుతున్న నీరు

పమిడిముక్కల: బందర్ కాలువకు జలకళ సంతరించుకొంది. మూడు నెలలుగా కాలువలకు నీటి సరఫరా నిలిపివేశారు. బ్యారేజీ నుంచి కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఈ నీటిని ఆకుమడులు తడుపుకునేందుకు పంట కాలువలకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కంకిపాడు నుంచి బందర్ కాలువకు వచ్చిన 188 క్యూసెక్కుల నీటిని వీరంకిలాకుల నుంచి సోమవారం దిగువకు, పమిడిముక్కల పంట కాలువకు విడుదల చేసినట్లు లాక్ సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు తెలిపారు.

బందరు కాలువకు నీరు విడుదల

నిడుమోలు(మొవ్వ): మొవ్వ మండలం నిడుమోలు లాకుల వద్ద బందరు కాలువకు సోమవారం నీరు విడుదల చేశారు. రైతులు నారుమడులు పోసుకునేందుకు వీలుగా నీటిపారుదల శాఖ నిడుమోలు సెక్షన్ అధికారుల ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ పాల్గొని జల పూజ చేశారు. 200 క్యూసెక్కుల నీటిని దిగువకు షట్టర్ ఓపెన్ చేసి విడుదల చేశారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ అరుణ, జేఈ సాధిక్, నిడుమోలు లాకు పర్యవేక్షకులు శ్రీనివాస్, నీటి సంఘాల అధ్యక్షులు రజనీకాంత్, నారాయణరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని 2025 మొదటి ఆర్థిక సంవత్సరం ఈ నెల 30వ తేదీన ముగుయుచున్న కారణంగా పురపాలక సంఘానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించు వారికి వడ్డీ రాయితీ కలదని మున్సిపల్ కమిషనర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికి ఈ రాయితీ ఉంటుందని పేర్కొన్నారు.

'కుళాయిల్లో మురుగు నీరు వస్తోంది'



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలోని గుడ్మెన్ పేట న్యూ కాలనీలో తాగునీటి కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుందని, సమస్యను పరిష్కరించాలని పట్టణ సీపీఎం కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గుడ్‌మాన్ పేటలోని స్థానికుల సమస్యలపై నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో డ్రెయినేజీలు పొంగి మంచినీటి కొళాయిల లీకులలో కలుస్తున్నాయన్నారు. వాటి ద్వారా నీరు కలుషితమై ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. స్థానికులు సమస్యను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గుడ్లవల్లేరు: తమ గ్రామంలోని మంచినీటి చెరువుకు తాగునీరు అందించేందుకు బోదెను ఏర్పాటు చేయాలని గుడ్లవల్లేరు మండలం చంద్రాల పంచాయతీ శివారు సింగలూరు గ్రామస్తులు జిల్లా అధికారులకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో విన్నవించారు. 20ఏళ్లగా తమ గ్రామంలో రాజకీయాలకతీతంగా ఏకమై ఒక ఆదర్శ గ్రామం నిర్మించుకోవటంలో ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా నడుస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. అటువంటి తమ గ్రామానికి జీవనానికి ప్రధాన వనరు అయిన టువంటి తాగునీటి సమస్య వచ్చిందన్నారు. గ్రామంలోని పంచాయతీ మంచినీటి చెరువుకు పడమర, ఉన్న పంట కాలువ నుంచి వచ్చు మంచినీటి బొదె ద్వారా గత ఏడు దశాబ్దాలుగా తాగునీరు వచ్చేదని తెలిపారు. ఈ మంచినీటి బోదె ప్రైవేటు భూమిలో నుంచి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సదరు భూమికి చాలామంది యజమానులు మారినప్పటికీ, ఈ తాగునీటి పారుదలను ఎవరూ ఆటంకపరచలేదన్నారు. ఇటీవల ఇప్పటి యజమాని అభ్యంతరం పెట్టడంతో గ్రామానికి మంచినీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యను ఈ నెల 19న తహసీల్దార్, ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్య పరిష్కారం చేయలేదన్నారు. ఇప్పటికైనా తమ గ్రామ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన రామాంజనేయులు

మోపిదేవి: ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీవిద్యను కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచి కోసూరు రామాంజనేయులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఉపాధి సిబ్బంది చేసిన తప్పులను గుర్తించారని తెలిపారు. పేద ప్రజలు ఉపాధి పనులు చేసుకుంటుంటే అందులోనూ అధికారులు అవినీతికి పాల్పడి కూలీలకు అన్యాయం చేశారని తెలిపారు. అవినీతికి పాల్పడినవారిని విధుల నుంచి తొలగించకపోతే అలాంటివారికి అధికారుల ప్రోత్సాహం ఉందని ప్రజలు అనుమానించాల్సి ఉంటుందన్నారు. అవినీతికి పాల్పడిన వారిని విధుల నుంచి తొలగించి తమ చిత్తశుద్ధిని చాటాలని వినతిపత్రంలో కోరారు.

సత్యసాయిబాబా దివ్యరథానికి స్వాగతం

కంకిపాడు: శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకల్లో భాగంగా స్వామి వారి ప్రేమ ప్రవాహిని దివ్య రథం ఆదివారం రాత్రి కంకిపాడు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు దివ్య రథానికి సాదర స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామిని ఆహ్వానించి పూజా కార్యక్రమాలు జరిపించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో ధ్యాన యోగ సాయి మందిరం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షురాలు పుష్పవతి, వైస్ ప్రెసిడెంట్ కడించెర్ల నాగప్రసాద్, శ్యామల పూర్ణకుంభంతో రథానికి స్వాగతం పలికి హారతులు పట్టారు. సత్యసాయి సేవాసంస్థ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. జిల్లా సమన్వయకర్త సనక పూర్ణచంద్రరావు, రాంబాబు, నాగేశ్వరరావు, ఓగిరాల గణేష్, రావి రమేష్, నందం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 36 మంది గైర్హాజరు



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్‌లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 179 మందికి గాను 143 మంది హాజరయ్యారని, 36 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందన్నారు.

విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో అలసత్వం

గుడివాడ టౌన్: విద్యా హక్కు చట్టం 12వ ఆర్టికల్ విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో అలసత్వం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు ఈ విషయాన్ని చర్చలతోనే కాలక్షేపం చేస్తున్నారని, అడ్మిషన్ ప్రక్రియలో అలసత్వం కొనసాగుతుందని తెలిపారు. ఈ కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. దీని వలన విద్యాహక్కు చట్టంలోని 12వ ఆర్టికల్ ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పేద విద్యార్థులు పాఠశాలల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు

ఉద్యోగోన్నతులు కల్పించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ముదినేపల్లి రూరల్ : గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగోన్నతులు కల్పించిన తరువాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని మండలంలోని సచివాలయాల ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ వై.రామకృష్ణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో సోమవారం అందజేశారు. చాలీచాలని జీతంతో పనిచేస్తున్న తమను సొంత మండలాలకు బదిలీ చేయాలని వినతిపత్రంలో కోరారు.

నేడు ఉపాధి పనుల ప్రజావేదిక

మండవల్లి: ఉపాధి హామీ పనుల సామాజిక ప్రజావేదిక 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే రామలింగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నూరు శాతం రుణాల వసూలు

ముదినేపల్లి రూరల్: మండలంలో ఉప్పరగూడెం సొసైటీ నూరు శాతం రుణాలు వసూలు చేసినట్లు సీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. సొసైటీలో రూ.3.73 కోట్ల రుణాలు వసూలు కావాల్సి ఉండగా వీటిని రైతుల నుంచి సకాలంలో వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు ముదినేపల్లి కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ అభినందిస్తూ సోమవారం ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు తెలిపారు.